క్లుప్తంగా

98 శాతం పింఛన్ల పంపిణీ



బ్రాహ్మణగూడెంలో పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

చాగల్లు: వలంటీర్లను దూరం పెట్టినా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ఆగకూడదనే లక్ష్యంతో మండలంలోని సచివాలయ సిబ్బంది నాలుగు రోజులలో 98 శాతం పింఛన్ల పంపిణీని పూర్తిచేశారు. సచివాలయ సిబ్బంది వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో ఉన్న వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందించారు. చాగల్లు మండలం పరిధిలో 9,617 మంది లబ్ధిదారులకు రూ. 2,77,36,500 కోట్లను ఇప్పటికే అందించారు. శనివారం నాటికి 98 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ ఎస్.బుజ్జి తెలిపారు.

19 లీటర్ల సారాతో ముగ్గురి అరెస్టు

దేవరపల్లి: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) దేవరపల్లి స్టేషన్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో శుక్ర, శనివారాల్లో అధికారులు దాడులు జరిపారు. ఈ సందర్భంగా ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 19 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఈబీ సీఐ కె.వెంకటేశ్వర స్వామి తెలిపారు. నల్లజర్ల మండలం కొత్తగూడెంలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 6.5 లీటర్ల సారా, దేవరపల్లి మండలం దుద్దుకూరులో మరో వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 7.15 లీటర్ల సారా, అలాగే గోపాలపురం మండలం జగన్నాథపురంలో ఇంకో వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 6.5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వివరించారు. ఈ దాడుల్లో ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు. గోపాలపురం తహసీల్దార్ ఎదుట తొమ్మిది మంది పాత ముద్దాయిలను బైండోవర్ చేసినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు.

పది లీటర్ల సారాతో మహిళ..

చాగల్లు మండలంలోని కలవలపల్లిలో సారా విక్రయిస్తున్న ఒక మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు చాగల్లు ఎస్సై పి.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించామన్నారు.

306 మందికి వైద్య పరీక్షలు

దేవరపల్లి: మండలంలోని లక్ష్మీపురంలో శనివారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 306 మంది రోగులను వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం ఇద్దరు రోగులను జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేసినట్టు దేవరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాంబశివరావు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎస్.హిందూశ్రీ, డాక్టర్ కె. శ్రీజాహ్నవి శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌ఓ అప్పారావు, సిబ్బంది సేవలు అందించారు.

అమ్మ సమాధిని దర్శించుకున్న తెలంగాణ సీఎస్



చివటంలో అమ్మ సమాధిని దర్శించుకున్న తెలంగాణ సీఎస్ శాంతకుమారి

ఉండ్రాజవరం: మండలంలోని చివటం గ్రామంలో అవధూత అమ్మగా భక్తులు కొలుచుకునే సాధు అమ్మ సమాధిని శనివారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అల్లంశెట్టి శాంతి కుమారి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కిరాల భరద్వాజ రచించిన అమ్మ చరిత్ర చదివి, ఆమె మహిమలు గ్రహించి వ్యక్తిగతంగా దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. ఆమెకు తహసీల్దార్ కె.నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, వీఆర్వో రాజశేఖర్ తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. శాంతకుమారి తొలుత అమ్మ సమాధిని దర్శించుకుని, 30 నిమిషాల పాటు ఒంటరిగా ధ్యానంలో నిమగ్నమయ్యారు. అనంతరం జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గ్రామంలోని వివిధ దేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు.

బోల్తాపడిన ట్యాంకర్



తాళ్లపూడి వద్ద ఏటిగట్టు పై నుంచి అదుపు తప్పి కింద పడిన ట్యాంకర్

తాళ్లపూడి: యాసిడ్ రవాణా చేస్తున్న ట్యాంకర్ తాళ్లపూడి వైపు నుంచి రాజమహేంద్రవరం వెళుతూ అదుపు తప్పి గోదావరి ఏటిగట్టు కిందకు బోల్తా కొట్టింది. శనివారం రాత్రి తాళ్లపూడి వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనలో అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదు. బోల్తా పడిన ట్యాంకర్‌లోని యాసిడ్‌ను వేరే ట్యాంకర్‌లోకి నింపారు. అయితే క్రేన్‌తో లారీని బయటకు తీస్తున్నపుడు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి ఓ వ్యక్తికి షాక్ కొట్టింది. అతడిని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు సమాచారం.



చాగల్లు మండలం చిక్కాల- 1 సచివాలయం వలంటీర్ల రాజీనామా



నిడదవోలు కమిషనర్ రాంభూపాల్‌రెడ్డికి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు



తాళ్లపూడిలో ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందిస్తున్న గజ్జరం వలంటీర్లు

మనసు గాయపడి.. కొలువు వీడి..

- మూకుమ్మడి రాజీనామా బాట పట్టిన వలంటీర్లు
- ఒక్క పెరవలి మండలంలో 171 మంది..
- అధికారులకు రాజీనామా పత్రాల అందజేత



పెరవలిలో ఎంపీడీఓ హిమ మహేశ్వరికి రాజీనామా పత్రాలు అందిస్తున్న కానూరు వలంటీర్లు

పెరవలి: గ్రామ వలంటీర్ల మనసు గాయపడింది. వారి మనోభావాలు దెబ్బతిన్నాయి. కేవలం గౌరవ వేతనం మాత్రమే పొందుతూ ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులు, పేదలకు పింఛన్లు, ప్రభుత్వ పథకాలు అందిస్తున్న వలంటీర్లు విపక్ష నేత చంద్రబాబు నాయుడు పన్నిన కుట్ర వల్ల ఇప్పుడా విధులకు దూరమయ్యారు. దాంతో మనస్తాపం చెందిన వారంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గత నాలుగు రోజులుగా వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. శనివారం వివిధ మండలాల నుంచి వందలాది మంది వలంటీర్ల రాజీనామాలు సమర్పించారు. పెరవలి మండలంలోని 20 సచివాలయాల పరిధిలో 399 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. వారిలో కానూరు, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, పెరవలి, కాపవరం, ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, అజ్జరం గ్రామాలకు చెందిన 171 మంది శనివారం రాజీనామాలు చేశారు. వారంతా తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కె.హిమమహేశ్వరికి అందించారు.

నిడదవోలు మండలంలో 118 మంది..

నిడదవోలు రూరల్: మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలో 118 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేసినట్టు ఎంపీడీఓ జేఏ ఝాన్సీ శనివారం తెలిపారు. పంచాయతీలవారీగా అట్లపాడు-9, కాటకోటేశ్వరం-17, కోరుమామిడి-22, పెండ్యాల-15, సమిశ్రగూడెం-5, తాడిమళ్ల-28, తాళ్లపాలెం-11, తిమ్మరాజుపాలెం-11 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తామంతా వలంటీర్లు పోస్టులకు రాజీనామా చేసి జగనన్నకు, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడికి మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు.



నిడదవోలు మండలం తాడిమళ్లలో రాజీనామా పత్రాలు చూపిస్తున్న వలంటీర్లు

నిడదవోలులో 61 మంది..

నిడదవోలు: పట్టణంలో శనివారం 61 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టి. రాంభూపాల్‌రెడ్డికి వారు తమ రాజీనామా లేఖలను అందించారు. వాటిని కమిషనర్ ఆమోదించారు. గతంలో 27 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ గత ఐదేళ్లగా సేవాభావంతో సంక్షేమ పథకాలు, అవ్వాతాతలకు పింఛన్లు పంపిణీ చేశామన్నారు. కానీ తమను టీడీపీ, జనసేన నాయకులు నేడు హీనంగా మాట్లాడుతున్నారన్నారు. అంతేగాకుండా పింఛనర్ల సేవ చేయ లేనపుడు తమకు ఈ ఉద్యోగం ఉన్నా, ఒకటే లేకున్నా ఒకటే అనే భావనతో స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ గెలుపునకు పని చేస్తామన్నారు.

తాళ్లపూడి మండలంలో 27 మంది..

తాళ్లపూడి: మండలలలోని గజ్జరం, పోచవరం, గ్రామాలకు చెందిన 27 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో వెంకటరమణకు అందించారు. రాజీనామా చేసిన వారిలో గజ్జరం గ్రామంలో 14 మంది, పోచవరం గ్రామంలో 13 మంది గ్రామ వలంటీర్లు ఉన్నారు. రాజీనామా చేసిన వారిలో గజ్జరం నుంచి పులపర్తి నందీశ్వరి, సంధ్య, ఎం. తులసి, ఎం పరిమళాదేవి, ప్రవీణ్ ప్రసాద్, కె. జ్యోతి, టి.భానుప్రసాద్, కిరణ్, పోచవరం నుంచి మందపాటి సంధ్య, ఎస్.దేవి, బి. బుజ్జి, ఎస్.విమల, కె. సరోజ, ఎస్. అనూష, మహేష్, రాజ్‌కుమార్, ప్రదీప్, నిర్మల, లక్ష్మీదుర్గ తదితరులు ఉన్నారు.

చిక్కాలలో 14 మంది..

చాగల్లు: మండలంలోని చిక్కాల- 1 సచివాలయం పరిధిలోని 14 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను ఎంపీటీఓ ఎం.బుజ్జికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లుగా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న తమపై విపక్షాల నేతలు అనేక ఆరోపణలు చేశారన్నారు. కానీ వృద్ధులు, వికలాంగులు, నిరాశ్రయులకు ప్రతి నెలా పింఛన్ అందించే పనిని నిబద్ధతతో చేస్తున్న తమపై చంద్రబాబు అనుచరులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, తమను ఆ విధులకు దూరం చేసినందుకు బాధపడ్డామన్నారు.. రాజీనామాలో చేసిన వారిలో ఎం.మల్లేశ్వరి, కె.గాయత్రీదేవి, ఎం.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సంజీవపురంలో 8 మంది..

గోపాలపురం: మండలంలోని సంజీవపురం సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఎనిమిది మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసినట్టు ఎంపీడీఓ కె.రమేష్‌బాబు శనివారం తెలిపారు. ఇప్పటి వరకూ మండలంలోని వాదాలకుంట, గోపాలపురం, సంజీవపురం, గంగోలు, దొండపూడి గ్రామ సచివాలయాల నుంచి సుమారు 70 మంది వలంటీర్లు తమ రాజీనామాలు సమర్పించినట్టు ఎంపీడీఓ చెప్పారు.

మీ ఆకాంక్షలు నెరవేర్చే పార్టీకే ఓటేయండి



ఉమ్మిడివారిపాలెం వాసులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న వరుణ్ సాయి

పెరవలి: ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే రాజకీయ పార్టీకే రాబోయే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడి కుమారుడు వరుణ్ సాయి అన్నారు. మండలంలోని ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారి పాలెం గ్రామాల్లో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ సాయి పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ ఎన్నికల్లో జగన్‌ను గెలిపిస్తే నియోజక వర్గాన్ని ఆదర్శవంతంగా తయారు చేస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వేండ్ర శ్రీను, సొసైటీ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు అరిగెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి శనివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. స్వామి వారికి అభిషేకం అనంతరం పురోహితులు భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాల పంపిణీతో పాటు 10 గంటల నుంచి అన్నసమారాధాన చేపట్టారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామివారి తీర్థ,ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఇటీవల కొత్తగా ప్రవేశ పెట్టిన నిత్య గోత్ర నామార్చన, శుక్రవారం అభిషేకం గోత్ర నామార్చనకు, స్వామి వారి పూల అలకంరణ, ప్రసాదం, అన్నదానానికి భక్తుల నుంచి విరాళాలు రూపంలో విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో వీఐపీ దర్శనాలు నిలిపి వేశామని స్పష్టం చేశారు.

టీడీపీకి ఓట్లేస్తే మళ్లీ కష్టాలే



ఇంటింటి ప్రచారంలో ఓ పసికందును ఎత్తుకుని ముద్దు చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

- హోం మంత్రి, గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- అనంతపల్లిలో మూడో రోజూ ఎన్నికల ప్రచారం

నల్లజర్ల: తెలుగుదేశం పార్టీ నాయకుల కల్లబొల్లి కబుర్లు నమ్మి ఆ పార్టీకి ఓట్లేస్తే, భవిష్యత్తులో కష్టాలు కొని తెచ్చుకున్నట్టే అని హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత అన్నారు. అనంతపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం మూడో రోజు పార్టీ శ్రేణులతో కలసి ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, ఎంపీటీసీ యడ్లపల్లి మార్త, బంక అప్పారావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జాదుల దుర్గారావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ప్రత్తి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం జోరుగా సాగింది. మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. మరోమారు వైఎస్సార్ సీపీకి అధికారం ఎందుకు ఇవ్వాలో వారికి వివరించారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామని మంత్రి చెప్పారు. పేదల పక్షపాతి అయిన జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నాయకులు కారుమంచి రమేష్, మట్టా లక్ష్మి, యజ్జవరపు లక్ష్మి, లైటింగ్ పండు, ముప్పిడి వెంకటరత్నం, మద్దిపాటి ప్రసాద్, మేణ్ని యువరాజు, బండి చిట్టి, నక్కా పండు, కానుబోయిన గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్షలాది ఉద్యోగాలతో యువతకు ఉపాధి

- వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ప్రక్కిలంక ప్రజాశీర్వాద యాత్రలో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

తాళ్లపూడి: చంద్రబాబు తన పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను నిరుద్యోగ రాష్ట్రంగా మారిస్తే, జగన్‌మోహన్ రెడ్డి యువతకు నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పించి, సువర్ణ రాష్ట్రంగా తీర్చిదిద్దారని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల్లో శనివారం ఆయన ప్రజాశీర్వాదయాత్ర పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ యాళ్ల స్వప్న, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు యాళ్ల బాబూరావు ఆధ్వర్యంలో ఈ ప్రచారం సాగింది. పార్టీ శ్రేణులతో కలసి తలారి వెంకట్రావు ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్ల జగన్ పాలనలో ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గ్రామస్తులను కోరారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు పెత్తనం చెలాయించాయే తప్ప పేదలకు మేలు చేయలేదన్నారు. వలంటీర్ వ్యవస్థపై విపక్ష నేత అనుచిత వ్యాఖ్యలు చేస్తూనే తాము అధికారంలోకి వస్తే ఆ వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పడం సిగ్గు చేటన్నారు. వైఎస్సార్ సీపీ హామీలను కూడా టీడీపీ వారు కాపీ కొడుతున్నారని విమర్శించారు. పేదలకు మంచి జరగాలంటే మళ్లీ జగన్ సీఎం కావాలన్నారు. ఈ ప్రచారంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, నాయకులు కుంటముక్కల కేశవనారాయణ, కొమ్మిరెడ్డి పరశురామారావు, పోశిన శ్రీకృష్ణదేవరాయలు, విత్తం నాని, గండి రాంబాబు, పిట్టా శ్రీనివాస్, కవల నాగేశ్వరరావు, ఎం. దయమంతి దితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపిస్తే మేలు



ఎన్నికల ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు, పార్టీ శ్రేణులు

- ప్రజా సేవకే జీఎస్ రావు కుటుంబం అంకితం
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీని ఆశీర్వదిస్తే ప్రజలందరికీ మంచి జరుగుతుందని ఆ పార్టీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని సూరాపురంలో ఆయన పార్టీ శ్రేణులతో కలసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజా సేవకే జీఎస్ రావు కుటుంబం అంకితమన్నారు. 30 ఏళ్లుగా అవినీతి మచ్చ లేకుండా రాజకీయాలు చేస్తున్నామన్నారు. కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల అభివృద్ధే ధ్యేయంగా పని చేశామని చెప్పారు. సూరాపురంలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దొంగ హామీలతో ఓట్లు అడిగేందుకు వస్తున్న కూటమి అభ్యర్థులకు బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను భారీ మెజార్టీలతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వద్దిరెడ్డి శ్రీను, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాగునీటికి నేడు అంతరాయం

నిడదవోలు: పట్టణంలోని నెహ్రూనగర్, బాలాజీనగర్ మంచి నీటి రిజర్వాయర్ల పరిధిలో నీటి సరఫరా ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మంచినీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి. రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. ఆరో వార్డులోని పాత పంగిడి రోడ్డులోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రధాన మంచి నీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. అందుకోసం ఒకటి నుంచి 11వ వార్డు వరకూ, 13 నుంచి 16 వార్డుల వరకూ, 21 నుంచి 28వ వార్డుల వరకూ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాను తాత్కాలికముగా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మంచినీటి ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తామన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. దుద్దుకూరులో శనివారం సాయంత్రం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సమక్షంలో ఏడు కుటుంబాల టీడీపీ కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి వనిత వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. కొమ్మర చిన్న, జొన్నకూటి కాంతారావు, క్లోపల్లి కార్తీక్, తిడిపగడప విక్టర్, కాండ్రుకోట సోమరాజు, కొప్పాక ఏసు, మరికొంత మంది పార్టీలో చేరారు.

ఇఫ్తార్ విందుల్లో శ్రీనివాస్ నాయుడు



చిన మసీదులో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, ముస్లింలు

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లింలకు పూర్తి రక్షణ, భరోసా కల్పించిందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని చిన మసీదు, బస్టాండ్ జనరల్ మసీదుల్లో శనివారం నిర్వహించి ఇఫ్తార్ విందుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లింలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడిని ఆప్యాయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మసీదు ముతవల్లిలు ఖయ్యూం, నౌషద్, అంజాద్, సుల్తాన్, మసీదు చైర్మన్ రఫీ, కౌన్సిలర్లు ఎస్‌కే వజీరుద్దీన్, సయ్యద్ వలీ తదితరులు పాల్గొన్నారు.